


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
15-11-2025
పేజీలు: 02

# ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు మంత్రి పదవి?



తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అత్యంత కీలకమైన ఎన్నిక జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మక సవాలుగా మారిన ఈ ఎన్నికలో.. నవీన్ యాదవ్ విజయం సాధించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి, ప్రభుత్వానికి భారీ ఊపునిచ్చింది. ఈ ఎన్నికలో ముఖ్యమంత్రి, మొత్తం కాంగ్రెస్ కేబినెట్ ఒకవైపు, బీఆర్ఎస్ అధినాయకత్వం మరోవైపు నిలబడి హోరాహోరీగా పోరాడాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఎన్నికలో గెలిచినందున.. నవీన్ యాదవ్‌కు దానికి తగ్గ రివార్డు (మంత్రి పదవి) దక్కుతుందా అనే చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో బలంగా నడుస్తోంది. పరిస్థితులు కూడా అందుకు అనుకూలంగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు బీసీ (వెనుకబడిన తరగతుల) నినాదాన్ని బలంగా వినిపించింది. రాష్ట్రంలో బీసీలకు సముచిత స్థానం కల్పించే ఉద్దేశంతోనే కుల గణన చేపట్టింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కట్టబెట్టడానికి ప్రయత్నించినా.. కోర్టుల అడ్డంకులు, కేంద్రం నుంచి మద్దతు లేకపోవడంతో ఆ ప్రయత్నం పూర్తిగా ఫలించలేదు. అందుకే.. బీసీలకు కేబినెట్‌లో మరిన్ని స్థానాలు కల్పించాలనే యోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉంది. ప్రస్తుత కేబినెట్‌లో ఉన్న బీసీ మంత్రి కొండా సురేఖతో కొన్ని పాలనాపరమైన ఇబ్బందులు ఉన్నాయనే చర్చ నడుస్తోంది. ఒకవేళ ఆమెను మార్చాల్సి వస్తే.. ఆ స్థానం కూడా బీసీలకే దక్కుతుంది. కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి కల్పించాలని కూడా కాంగ్రెస్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. కాబట్టి.. రాబోయే మంత్రివర్గ విస్తరణలో ఇద్దరు లేదా ముగ్గురు బీసీ నేతలకు అవకాశం దక్కే ఛాన్స్ ఉంది. ఈ అవకాశాన్ని నవీన్ యాదవ్ అందిపుచ్చుకునే అవకాశం ఉంది. నవీన్ యాదవ్‌కు మంత్రి పదవి దక్కడానికి కేవలం బీసీ కోటా మాత్రమే కాదు, ఇతర సమీకరణాలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్, హైదరాబాద్‌కు గుండెకాయ లాంటిది. ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించడం పార్టీకి కచ్చితంగా ఒక అడ్వాంటేజ్. గతంలో హైదరాబాద్‌కు మంత్రివర్గంలో సరైన ప్రాతినిధ్యం లేదనే లోటు ఉండేది. ఇటీవల మహమ్మద్ అజారుద్దీన్‌కు పదవి ఇచ్చినా.. నవీన్ యాదవ్‌కు అవకాశం దక్కితే మహానగరానికి మరింత బలమైన ప్రాతినిధ్యం దొరుకుతుంది. హైదరాబాద్‌లో నవీన్ యాదవ్‌కు చెందిన యాదవ సామాజిక వర్గం ప్రభావం చాలా ఎక్కువ. దాదాపు ప్రతీ నియోజకవర్గంలో వీరి ఓటు ఇంపాక్ట్ ఉంటుంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో తలసాని శ్రీనివాస యాదవ్ ఈ వర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుత కేబినెట్లో ఈ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేదు. ఈ లోటును తీర్చడానికి నవీన్ సరైన ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా గెలిచినా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ బోల్తా పడిం ది. రాబోయే స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికలకు ముందు.. పార్టీకి సామాజిక వర్గ దన్ను, అంగబలం, అర్థబలం ఉన్న బలమైన గ్రేటర్ నేత అవసరం. నవీన్ యాదవ్‌కు మించిన ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. ప్రస్తుతం తెలంగాణ మంత్రివర్గంలో ముఖ్యమంత్రి సహా మొత్తం 12 మంది మంత్రులు ఉన్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. తెలంగాణలో మరో ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. నవీన్ సీనియర్ కాకపో వడం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితంగా ఉండటం వలన, ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం సీఎంకు కంఫర్ట్ గా ఉం టుంది. ఇన్ని సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు నవీన్ యాదవ్‌కు అనుకూలంగా ఉండటంతో.. విస్తరణలో ఆయనకు మంత్రి పదవి దక్కే ఛాన్సులు చాలా ఎక్కువగా ఉన్నాయి.



## శుభమన్ గిల్ రిటైర్డ్ హర్ట్

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్ రెండో రోజు భారత కెప్టెన్ శుభమన్ గిల్ రిటైర్డ్ హార్ట్ అయ్యాడు. మెడ పట్టేయడంతో అతను మైదానం వదిలి వెళ్లాడు. ఇవాళ ఉదయం తొలి సెషన్‌లో ఈ ఘటన జరిగింది. రెండో వికెట్ రూపంలో వాషింగ్టన్ సుందర్ ఔటైన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ గిల్ కేవలం మూడు బంతులు మాత్రమే ఆడాడు. హార్మర్ బౌలింగ్‌లో స్వీప్ షాట్‌తో బౌండరీ కొట్టిన గిల్ ఆ తర్వాత బ్యాటింగ్ చేయలేకపోయాడు. మెడ పట్టేయడంతో అతను తల తిప్పలేకపోయాడు. దీంతో రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. ఆ తర్వాత రిషబ్ పంత్ బ్యాటింగ్‌కు వచ్చాడు. ప్రస్తుతం ఇండియా 38 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 94 రన్స్ చేసింది.



## హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

హైకోర్టు వెబ్‌సైట్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఆర్డర్ కాపీలు డౌన్‌లోడ్ చేస్తుండగా ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ తెరుచుకున్నది. పీడీఎఫ్ ఫైల్స్‌కు బదులుగా బీడీజీ స్లాట్ బెట్టింగ్ సైట్ వస్తున్నది. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులకు హైకోర్టు రిజిస్ట్రీ ఫిర్యాదు చేశారు. హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్‌పై కేసు నమోదుచేసి సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## క్యూట్ లుక్స్‌లో ఆషికా

ఆషికా రంగనాథ్.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన హీరోయిన్. చేసింది తక్కువ సినిమాలే అయినా అందం, అభినయంతో కట్టిపడేసింది. అలాగే ఈ అమ్మడి నటనకు మంచి మార్కులు పడ్డాయి. నటించిన రెండు చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నప్పటికీ ఆఫర్స్ రావడం లేదు. 1996లో కర్ణాటకలో పుట్టిన ఆషికా.. కన్నడ సినీరంగంలోకి అడుగుపెట్టింది. కాలేజీ రోజుల్లోనే మిస్ ఫ్రెష్ ఫేస్ పోటీల్లో పాల్గొ రన్నరప్ గా నిలిచింది. అదే పోటీలో ఆమెను చూసిన దర్శకుడు మహేష్ బాబు సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. ఆతర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది ఈ భామ. క్రేజీ బాయ్ సినిమాతో సినీరంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమాకే ఉత్తమ నటిగా సైమా అవార్డ్ అందుకుంది.




## చున్నీ తీయడంపై ట్రోల్స్.. డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ ఘాటైన సమాధానం

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం ది గర్ల్‌ఫ్రెండ్ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో నవంబర్ 7న విడుదలైన ఈ లవ్ ఎంటర్‌టైనర్ సూపర్ హిట్‌గా నిలిచి రెండు వారాల్లోనే రూ.20 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. రిలేషన్స్‌లో టాక్సిక్ బిహేవియర్ వల్ల అమ్మాయిలు ఎదుర్కొనే భావోద్వేగ, వ్యక్తిగత సమస్యలను నిజజీవితానికి దగ్గరగా చూపించినందుకు మహిళలు ఈ సినిమా కథను తమదిగా భావిస్తూ సోషల్ మీడియాలో విస్తృతంగా స్పందిస్తున్నారు.ఈ నేపథ్యంలో సినిమా చూసిన ఓ యువతి చేసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. రష్మిక సినిమా చూసిన ఆ అమ్మాయి డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్‌ను ప్రత్యక్షంగా కలసి అభినందిస్తూ, సినిమా ఇచ్చిన ధైర్యంతో తాను తన చున్నీ తొలగించి గర్వంగా తిరుగుతానని



చూపించింది. ఈ సంఘటనను చూసి ప్రేక్షకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇక రాహుల్ అయితే ఆమెను మెచ్చుకుంటూ హగ్ కూడా ఇచ్చాడు. అయితే ఈ వీడియో బయటకు రాగానే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం ప్రారంభమైంది.ఒక నెటిజన్ మాత్రం ఇది అన్నీ సినిమా ప్రమోషన్ కోసమే ముందస్తుగా ప్లాన్ చేసిన పీఆర్ స్టంట్ అంటూ, ఆ యువతికి డబ్బులు ఇచ్చి హగ్ సీన్ షూట్ చేయించారని ఆరోపిస్తూ ట్రోల్ చేశాడు. దీనిపై దర్శకుడు రాహుల్ రవీంద్రన్ గట్టిగా స్పందించారు.అలాగే మహిళలపై సమాజం చూపించే పక్షపాత ధోరణిపై రాహుల్ కొరడా ఝుళిపించారు. హీరోలు యాక్షన్ సీన్స్‌లో చొక్కా చించుకుంటే ఎవరూ ప్రశ్నించడం లేదు. కానీ ఒక అమ్మాయి యాదృచ్ఛికంగా చున్నీ తీసేసిందంటే మాత్రం సంస్కృతి ప్రమాదంలో పడిపోయింది అంటున్నారు. సంస్కృతిని కాపాడుకోవాల్సిందల్లా మహిళల భుజాలపైనే ఎందుకు మోపారు?, "ది గర్ల్‌ఫ్రెండ్ లాంటి సినిమాలు అవసరమా అని కొందరు అడిగితే_ _ _ ఈ చిత్రానికి వస్తున్న స్పందన, అమ్మాయిల నిజజీవిత అనుభవాలు స్వయంగా సమాధానం చెబుతున్నాయి" అని రాహుల్ స్పష్టం చేశారు.



## టిబెట్‌లో స్వల్ప భూకంపం.. 4.1 తీవ్రత

టిబెట్‌లో స్వల్ప భూకంపం వచ్చింది. 4.1 తీవ్రతతో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. భూ అంతర్భాగంలో 60 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని తెలిపింది. భూకంపం వల్ల సంభవించిన నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉన్నది. కాగా, ఈ నెల 11న కూడా టిబెట్‌లో స్వల్పంగా భూమి కంపించింది. 3.8 తీవ్రతతో భూకంపం వచ్చింది. భూమిలో 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపణలు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు.

## పోలీసులకే సవాల్ విసిరిన 'ఐబొమ్మ' నిర్వాహకుడు అరెస్ట్

ప్రముఖ ఆన్‌లైన్ సినిమా పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' కీలక నిర్వాహకుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సినీ పరిశ్రమకు భారీగా నష్టాన్ని కలిగించడమే కాకుండా.. పోలీసులకు బహిరంగంగా సవాలు విసిరిన రవి ఇమ్మాడి అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రవి విదేశాల నుంచి హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్టుకు చేరుకోగా పక్కా సమాచారంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్ట్ కోసం పోలీసులు గత ఆరు నెలలుగా నిందితుడి కోసం గాలిస్తున్నారు. ప్రస్తుతం అతడిని కూకట్‌పల్లి స్టేషన్‌కి పోలీసులు తరలించారు. ఐబొమ్మ వెబ్‌సైట్ వల్ల సినీ



పరిశ్రమకు దాదాపు రూ.3,000 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని అంచనా. ఓటీటీల్లో విడుదలైన కొత్త సినిమాలను, అలాగే థియేటర్లలో విడుదలైన హెచ్‌డీ ప్రింట్లను సైతం ఈ వెబ్‌సైట్ అక్రమంగా పైరసీ చేసి ఉచితంగా అందిస్తూ వచ్చింది. దీంతో ఈ విషయంపై సినీ పెద్దలు పోలీసులకు దృష్టికి తీసుకువెళ్లగా.. ఇటీవలే మూవీరూల్జ్ నిర్వహాకులను అరెస్ట్ చేశారు. అయితే ఐబొమ్మని కూడా త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు ప్రకటన విడుదల చేయగా.. పోలీసులను ప్రకటనను సవాలు చేస్తూ.. ఐబొమ్మ నిర్వాహకుడు రవి బహిరంగంగా బెదిరింపులకు దిగాడు. తన వెబ్‌సైట్‌పై దృష్టి పెడితే సినీ పరిశ్రమతో పాటు పోలీసు అధికారులు, హీరోల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన సీక్రెట్‌లను బయటపెడతానని హెచ్చరించడం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది.


## కేకేఆర్ బౌలింగ్ కోచ్‌గా టిమ్ సౌథీ

రాబోయే ఐపీఎల్ సీజన్ కోసం అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తమ కోచింగ్ సిబ్బంది నియామకాన్ని పూర్తిచేసే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే హెడ్‌కోచ్‌గా అభిషేక్ నాయర్, అసిస్టెంట్ కోచ్‌గా షేన్ వాట్సన్‌ను ఎంపిక చేసుకున్న ఆ జట్టు.. తాజాగా బౌలింగ్ కోచ్‌గా న్యూజిలాండ్ దిగ్గజ పేసర్ టిమ్ సౌథీని నియమించుకుంది. కివీస్ తరఫు అంత ర్జాతీయ స్థాయిలో 776 వికెట్లు తీసిన అనుభవమున్న సౌథీ.. కేకేఆర్ తరఫున మూడు సీజన్ల (2021-2023 వరకూ)లో ప్రాతనిధ్యం వహించాడు.




## నేడు సిట్ విచారణకు హాజరుకానున్న దగ్గుబాటి రానా


ప్రముఖ నటుడు దగ్గుబాటి రానా నేడు అక్రమ బెట్టింగ్ యాప్‌ల కేసు విచారణ నిమిత్తం సిట్ ముందు హాజరుకానున్నారు. తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఈ బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంలో పలువురు సినీ ప్రముఖులకు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించి సమాచారం తెలుసుకునేందుకు సిట్ అధికారులు గతంలో రానాకు నోటీసులు జారీ చేశారు. సిట్ కార్యాలయంలో ఈరోజు రానాను అధికారులు ప్రశ్నించనున్నారు. ఈ బెట్టింగ్ యాప్‌ల ప్రచారంలో రానా పాత్ర ఏమైనా ఉందా, లేదా ఈ యాప్‌ల నిర్వాహకులతో ఆయనకు ఏమైనా ఆర్థిక లావాదేవీలు ఉన్నాయా అనే కోణంలో అధికారులు విచారణ జరపనున్నారు. రానా విచారణ అనంతరం ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇంతకుముందే ఈ కేసులో నటులు విజయ్ దేవరకొండతో పాటు ప్రకాశ్ రాజ్‌ని సిట్ విచారించింది.



సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

## ఫ్యాన్సీ నంబర్ల వేలం.. తెలంగాణ రవాణా శాఖకు

# భారీ ఆదాయం




తెలంగాణ రవాణా శాఖకు ఫ్యాన్సీ నంబర్లు భారీ మొత్తంలో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. ప్రతిసారీ కొత్త సిరీస్ మొదలైనప్పుడు.. వాహనదారులు తమ వాహనాలకు అదృష్ట సంఖ్యలు, పునరావృత సంఖ్యలు లేదా తమకు ఇష్టమైన సంఖ్యలు దక్కించుకోవడానికి పెద్ద మొత్తంలో వేలంపాటలో పాల్గొంటారు. తాజాగా జరిగిన వేలంపాటలో.. కేవలం ఒక్క రోజులోనే ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయానికి అసాధారణ రీతిలో రూ. 65,38,889 ల ఆదాయం వచ్చినట్లు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్ తెలిపారు. రికార్డు స్థాయిలో పలికిన నంబర్లు.. ఈ వేలంపాటలో అత్యధికంగా పలికిన నంబర్ TG 09 H 9999. ఈ నంబర్ కోసం పోటీపడిన హనర్ ప్రైమ్ హౌసింగ్ ఎల్ఎల్‌పీ సంస్థ ఏకంగా రూ. 22,72,222 చెల్లించి కైవసం చేసుకుంది. ఇది ఆ ఒక్క రోజులో అత్యంత ఖరీదైన సంఖ్యగా నిలిచింది. దీనికి వ్యతిరేకంగా.. అతి తక్కువగా TG 09 J 0003 నంబరుకు కూడా రూ. 1,15,121 ఆదాయం వచ్చిందంటే.. వాహనదారులకు ఫ్యాన్సీ నంబర్లపై ఉన్న మక్కువ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.

వేలంలో కీలక విజేతలు.. ఫ్యాన్సీ నంబర్ల కోసం ప్రముఖ సంస్థలు, వ్యక్తులు పోటీపడ్డారు. ముఖ్యంగా డెవలపర్లు, ఎనర్జీ సంస్థలు, ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీలు తమ వ్యాపార వాహనాలకు, వ్యక్తిగత వాహనాలకు ఈ ప్రత్యేక సంఖ్యలను దక్కించుకోవడానికి వెనుకాడలేదు. TG 09 J 0009: ఈ సంఖ్యను రూ. 6,80,000 లకు మెస్సర్స్ దండు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. TG 09 J 0006.. దీని కోసం సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ యాజమాన్యం రూ. 5,70,666 చెల్లించింది. TG 09 J 0099.. ఈ నంబరును రూ. 3,40,000 లకు మెస్సర్స్ గోదావరి ఫార్చ్యూన్ సంస్థ దక్కించుకుంది. TG 09 J 0001.. సింగిల్ డిజిట్ నంబరు కోసం శ్రీనిధి ఐటీ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 2,60,000 చెల్లించింది. TG 09 J 0005.. దీనిని రూ. 2,40,100 లకు నిహారిక ఎంటర్ టైన్ మెంట్ సంస్థ దక్కించుకుంది. రవాణా శాఖకు ఈ ఫ్యాన్సీ నంబర్లు ఒక అదనపు ఆదాయ వనరుగా మారాయి. వాహనదారులు ఇంత భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేయడానికి ప్రధానంగా కొన్ని కారణాలు ఉన్నాయి. చాలా మంది సంఖ్యాశాస్త్రం (న్యూమరాలజీ) ప్రకారం తమకు అదృష్టం తెచ్చే సంఖ్యలను, లేదా శుభప్రదమైన '9' వంటి సంఖ్యలను కోరుకుంటారు. నిర్మాణ, రియల్ ఎస్టేట్ సంస్థలు తమ బ్రాండ్ లేదా హోదాను ప్రతిబింబించే సంఖ్యలను లేదా సులభంగా గుర్తుంచుకోగలిగే సంఖ్యలను (ఉదా: 0001, 0009) కొనుగోలు చేస్తాయి. ఇది వారి మార్కెట్ విలువను, హోదాను సూచిస్తుంది. కొంతమందికి తమ పుట్టిన తేదీ, లేదా ఇష్టమైన సంఖ్యలు ఉండేలా చూసుకుంటారు. ఈ వేలం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది. వాహనదారుల నుంచి వచ్చే ఈ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడుతుంది. ఈ ఒక్క రోజు ఆదాయమే రవాణా శాఖకు ఫ్యాన్సీ నంబర్లు ఎంత కీలకమో స్పష్టం చేస్తోంది.



## బాలల దినోత్సవం సందర్భంగా
## గౌతమ్ మోడల్ స్కూల్ లో ఘనంగా స్పోర్ట్స్ డే

బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుమలగిరి గౌతమ్ మోడల్ స్కూల్ లో 'స్పోర్ట్స్ డే' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుమలగిరి అసిస్టెంట్ కమిషనర్ అఫ్ పోలీస్ రమేష్ కుమార్ మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు హాజరయ్యారు. వివిధ రకాల ఆటలపోటీలలో విజేతలుగా నిలిచిన వారికీ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణని ఈ దశలోనే పెంపొందించుకోవాలని, అలానే క్రీడలు శారీరక దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలియజేసారు. గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థుల క్రమశిక్షణని చూసి అభినందించారు. పాఠశాలలో పాఠాలనే కాక, క్రీడలని ప్రోత్సహిస్తున్న ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి గౌతమ్ మోడల్ స్కూల్ డీన్ మధుకుమార్, ప్రధానోపాధ్యాయులు కల్పన , పీటీ అభిషేక్ , తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీబీసీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా




తన ప్రసంగాన్ని ఎడిట్ చేసి తప్పుగా ప్రసారం చేసిన బీబీసీ వార్తాసంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. పనోరమా సిరీస్ డాక్యుమెంటరీ కోసం ట్రంప్ ప్రసంగాన్ని బీబీసీ వాడుకున్నది. కానీ ఆ ప్రోగ్రామ్‌లో ప్రజల్ని రెచ్చగొట్టే రీతిలో ట్రంప్ ప్రసంగాన్ని ఎడిట్ చేశారు. ఈ అంశంలో బీబీసీ సంస్థ ఇప్పటికే క్షమాపణలు చెప్పింది. ఆ కంపెనీలో పనిచేస్తున్న ఇద్దరు ఉన్నద ఉద్యోగులు కూడా రాజీనామా చేశారు. కానీ ట్రంప్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఆ వార్తా సంస్థపై లీగల్ చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. నష్టపరిహారాన్ని కూడా వసూల్ చేయనున్నట్లు చెప్పారు. కొన్ని రోజుల క్రితం ట్రంప్‌కు సారీ చెప్పిన బీబీసీ సంస్థ.. ఆయనకు నష్ట పరిహారాన్ని ఇచ్చేందుకు నిరాకరించింది. అయితే శుక్రవారం ఎయిర్ ఫోర్స్ వన్‌లో రిపోర్టర్లతో మాట్లాడిన ట్రంప్.. వచ్చే వారం బీబీసీపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆ సంస్థపై కనీసం బిలియన్ నుంచి 5 బిలియన్ల డాలర్ల పరిహారాన్ని కోరనున్నట్లు వెల్లడించారు. 2021, జనవరి 6వ తేదీన చేసిన ప్రసంగాన్ని బీబీసీ తప్పుగా ఎడిట్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. క్యాపిటల్ హిల్ హింసకు ప్రేరేపించినట్లు ఆ ప్రసంగంలో ఉన్నది. ఈ ఘటనతో లింకున్న బీబీసీ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవ్, న్యూస్ హెడ్ దెబోరా టర్నెస్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

## సరైన హిట్ కోసం...

భాగ్యశ్రీ బోర్సే టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ గుర్తింపు సంపాదించుకుంది. 'మిస్టర్ బచ్చన్', 'కింగ్‌డమ్' తర్వాత తాజాగా ఆమె నటించిన మూడో చిత్రం 'కాంత' విడుదలైంది. దుల్కర్ సల్మాన్, సముతిరకని లాంటి శక్తివంతమైన నటుల సరసన భాగ్యశ్రీ అద్భుతంగా నటించిందని ప్రేక్షకులు ప్రశంసించారు. అలనాటి నటి సావిత్రిని తలపించేలా ఆమె నటన ఆకట్టుకున్నా, సినిమా మాత్రం కమర్షియల్‌గా బలహీనంగా నిలిచింది. వరుస ఫలితాలతో భాగ్యశ్రీకి ఇంకా సరైన హిట్ దొరకలేదని వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఆమె ఆశలన్నీ రామ్ పోతినేని హీరోగా వచ్చే 'ఆంధ్ర కింగ్ తాలుకా' మీదే ఉన్నాయి.




## జియో సిగ్నల్ సమస్యకు చెక్..
# బిఎస్ఎన్ఎల్‌తో అంబానీ ఒప్పందం





ముఖేష్ అంబానీ వేసే ప్లాన్స్ మామూలుగా ఉండదు. ఎందుకంటే తన బిజినెస్‌ను మెరుగుపర్చుకోవడానికి ఏదైనా చేస్తాడు. బిజినెస్ మెన్‌కు ఉన్న లక్షణాలు స్పష్టంగా కనిపిస్తుంది. రిలయన్స్ జియో కనెక్టివిటీని మెరుగుపరచడానికి ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది.జియో, బిఎస్ఎన్ఎల్ తమ నెట్‌వర్క్ కవరేజీని విస్తరించడానికి భాగస్వామ్యం చేసుకున్నాయి. దీని ప్రకారం, జియో సిగ్నల్ లేని మారుమూల ప్రాంతాల్లోని వినియోగదారులు ఇప్పుడు బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవచ్చు, జియో కస్టమర్లు బలమైన నెట్‌వర్క్‌ను పొందుతారు. జియో వినియోగదారులు తరచుగా సిగ్నల్ లేని మారుమూల ప్రాంతాలలో కూడా ఇప్పుడు బిఎస్ఎన్ ఎల్ నెట్‌వర్క్ ద్వారా సులభంగా కాల్స్ చేయవచ్చు. ఇంటర్నెట్‌ను కూడా యాక్సెస్ చేయవచ్చు. రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాల్లో విస్తరించవచ్చు. ఈ ఒప్పందం వల్ల జియో వినియోగదారులు మారుమూల ప్రాంతాల్లో కూడా కనెక్టివిటీని ఆస్వాదించవచ్చు. టెలికామ్‌టాక్ నివేదిక ప్రకారం.. జియో ఎంపిక చేసిన ప్రీపెయిడ్ రీఛార్జ్‌లతో బిఎస్ ఎన్ఎల్L ICR సేవ అందుబాటులో ఉందని తెలిపింది. ఈ ప్లాన్‌లతో జియో వినియోగదారులు ఎంపిక చేసిన ప్రదేశాలలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు కనెక్ట్ అవ్వవచ్చు. అదే భౌగోళిక ప్రాంతంలో వాయిస్, డేటా,ఎస్మెస్ సేవలను ఉపయోగించవచ్చు.

## ఉగ్ర లింకు.. ఆ నలుగురు డాక్టర్ల రిజిస్ట్రేషన్ రద్దు



ఎర్రకోట సమీపంలో సూసైడ్ బాంబింగ్ నిందితుడు డాక్టర్ ఉమర్-ఉన్-నబీ అలియాస్ ఉమర్ మహ్మద్‌కు చెందిన పుల్వామాలోని అతని ఇంటిని భద్రతా బలగాలు బాంబులతో పేల్చేశాయి. ఇదే కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకున్నది. ఉగ్రవాద మాడ్యూల్‌తో సంబంధం ఉన్న నలుగురు డాక్టర్లపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ చర్యలు తీసుకున్నది. వారి రిజిస్ట్రేషన్లను రద్దు చేసింది. దేశంలో ఎక్కడా వైద్య వృత్తిని నిర్వహించకుండా ఎన్ఎంసీ నిషేధం విధించింది. ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్‌లు నమోదవడం, జమ్మూకశ్మీర్ పోలీసుల నుంచి అందిన సమాచారం, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సమర్పించిన నివేదికలను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నది. డాక్టర్ ముజాఫర్ అహ్మద్, డాక్టర్ అదీల్ అహ్మద్ రాదర్, డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ షాహీన్ సయీద్‌ల ఇండియన్ మెడికల్ రిజిస్ట్రీ , నేషనల్ మెడికల్ రిజిస్ట్రీలోని రిజిస్ట్రేషన్‌ను వచ్చేలా రద్దు చేసినట్లు ప్రకటించింది. ఇది వెంటనే అమలులోకి వస్తుందని తెలిపింది. వీరికి ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడుతో సంబంధం కలిగి ఉన్నట్లు ఎన్ఎంసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో ఎన్ఎంసీ ఆదేశాల మేరకు ఆయా రాష్ట్రాల మెడికల్ కౌన్సిళ్లు ఈ నలుగురు డాక్టర్ల పేర్లను ఇండియన్, నేషనల్ మెడికల్ రిజిస్టర్లను తొలగించాయి.

## కశ్మీర్ పోలీస్ స్టేషన్‌లో భారీ పేలుడు..
# తొమ్మిది మంది దుర్మరణం



జమ్మూకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. దీంతో తొమ్మిది మంది మృతి చెందగా, సుమారు 30 మంది గాయపడ్డారు. మృతుల్లో పోలీసులు, ఫోరెన్సిక్ సిబ్బంది ఉన్నారు. శుక్రవారం రాత్రి 11.22 గంటల సమయంలో జరిగిన ఈ పేలుడు ధాటికి పోలీసు స్టేషన్ ధ్వంసమైంది. ఫరీదాబాద్ ఉగ్ర కుట్రకు సంబంధించి ఇటీవల సీజ్ చేసిన పేలుడు పదార్థాల నుంచి శాంపిల్స్ తీస్తుండగా ఈ ఘటన జరిగినట్టు అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. భారీ పేలుడుతో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయని, ఆ ప్రాంతంలో దట్టమైన పొగ వ్యాపించిందని వెల్లడించారు. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారని, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో పార్కింగ్‌లో ఉన్న పలువాహనాలకు మంటలు అంటుకున్నాయి. పేలుడు ధాటికి దాదాపు 300 మీటర్ల దూరం వరకు శరీర భాగాలు పడ్డాయని తెలిపారు. ఇటీవల ఫరీదాబాద్‌లోని డాక్టర్ ముజామిల్ షకీల్ ఇంట్లో హర్యానా, జమ్ము పోలీసులు సంయుక్తంగా సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అక్కడ 3 వేల కిలోల పేలుడు పదార్థాలతో పాటు పలు ఆయుధాలను స్వాధీనం చేసుకొని నౌగామ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాటి నుంచి నమూనాలను తీస్తుండగా విస్ఫోటం జరిగిందని అధికారులు పేర్కొన్నారు.

## రైతన్నలకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్



రైతులకు ఇది నిజంగా గుడ్ న్యూస్ అని చెప్పాలి. రాష్ట్రంలో కూరగాయల కొరతను తగ్గిస్తూ స్థానిక అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2025—26 ఆర్థిక సంవత్సరానికి కొత్తగా 10 వేల ఎకరాల్లో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు నిర్ణయం తీసుకుంది. రైతులపై భారం తగ్గించేందుకు ఎకరాకు రూ.9,600 సబ్సిడీని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 1.35 లక్షల ఎకరాల్లో 14.64 లక్షల టన్నుల కూరగాయల ఉత్పత్తి జరుగుతోంది. అయితే రాష్ట్రంలో దాదాపు 26 లక్షల టన్నుల కూరగాయల ఉత్పత్తి అవసరముంది. వ్యవసాయ విశ్వవిద్యాలయ సర్వే ప్రకారం.. 12.68 లక్షల టన్నుల లోటు ఉత్పత్తి ఉందని, ఈ లోటును పూడ్చేందుకు ప్రతి ఏడాది 10 వేల ఎకరాల్లో అదనపు సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఉద్యానశాఖ అంచనా ప్రకారం ఎకరానికి విత్తనాలు, నారు, ఎరువులు, పురుగుమందులు, పోషక యాజమాన్యం వంటి ఖర్చులు కలిపి రూ.24,000 వరకూ ఉంటాయి. అందులో 40% సబ్సిడీగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులకు రూ.9,600 మద్దతు లభిస్తుంది. ఒక్కో రైతు గరిష్ఠంగా 2.5 ఎకరాల వరకు ఈ సబ్సిడీ పొందవచ్చు.

## పెళ్లి కోసం బీసీసీఐకి సెలవు
## అప్లికేషన్ పెట్టుకున్న కులదీప్ యాదవ్



భారత క్రికెట్ జట్టు స్టార్ స్పిన్నర్ కులదీప్ యాదవ్ తన జీవితంలో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించడానికి సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం సౌత్ ఆఫ్రికాతో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఆడుతున్న కులదీప్, తన పెళ్లి కోసం బీసీసీఐకి సెలవు కోరుతూ విజ్ఞప్తి చేసినట్లు మీడియా నివేదికలు చెబుతున్నాయి. ఒకవేళ బీసీసీఐ ఈ సెలవును మంజూరు చేస్తే, కులదీప్ కీలకమైన టెస్ట్, వన్డే మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉంది. కులదీప్ యాదవ్ తన చిన్ననాటి స్నేహితురాలు వంశికతో కలిసి కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నాడు.2025 జూన్ 4న లక్నోలో జరిగిన ఒక ప్రైవేట్ వేడుకలో వీరి నిశ్చితార్థం జరిగింది. ఆ కార్యక్రమానికి క్రికెటర్ రింకూ సింగ్‌తో పాటు సన్నిహితులు హాజరయ్యారు. కులదీప్ పెళ్లి నవంబర్ చివరి వారంలో జరిగే అవకాశం ఉంది. బీసీసీఐ వర్గాలు కూడా కులదీప్ సెలవు అడిగినట్లు ధృవీకరించాయి. నవంబర్ చివరి వారంలో సెలవు అడగడం వలన, కులదీప్ యాదవ్ సౌతాఫ్రికాతో జరగబోయే సిరీస్‌లోని కొన్ని ముఖ్యమైన మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉంది. భారత్ vs సౌత్ ఆఫ్రికా మధ్య రెండవ టెస్ట్ నవంబర్ 22 నుంచి గువహాటిలో ప్రారంభం కానుంది.